క్లుప్తంగా

వరద బాధితులకు కేఎల్పీ విద్యార్థుల విరాళం



గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తమ తల్లిదండ్రుల వద్ద నుంచి సేకరించిన రూ.1,84,500లను సీఎం చంద్రబాబుకు సీఎం రిలీఫ్ ఫండ్ పేరిట డీడీ రూపంలో అందజేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును పాఠశాల యాజమాన్యంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసినట్లు తెలిపారు.

వరద బాధితులకు పొత్తూరు జెడ్పీ విద్యార్థుల విరాళం



గుంటూరు ఎడ్యుకేషన్: వరద బాధితుల సహాయార్థం గుంటూరు రూరల్ పొత్తూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సేకరించిన రూ.12,633లు సీఎం రిలీఫ్ ఫండ్ పేరుతో తీసిన డీడీని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజకు పాఠశాల హెచ్ఎం ఎ.మధుమోహన్ గురువారం కలెక్టరేట్‌లో కలిసి అందజేశారు. వరద బాధితులు పడుతున్న కష్టం, బాధలను టీవీలు, దినపత్రికల ద్వారా తెలుసుకున్న విద్యార్థులు చలించిపోయి తల్లిదండ్రులతో పాటు గ్రామస్తుల నుంచి విరాళాన్ని సేకరించారని హెచ్ఎం మధుమోహన్ జేసీ దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా విద్యార్థులను జేసీ భార్గవ్‌తేజ అభినందించారు. జేసీని కలిసిన వారిలో ఉపాధ్యాయులు ఉప్పాల రామమోహనరావు, ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.

పేదలకు అండ ఎంహెచ్‌పీఎస్ లక్ష్యం




గుంటూరు మెడికల్: పలు కారణాలతో నిరాశ్రయులైన పేద ప్రజలకు అండగా ఉండటమే మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) లక్ష్యమని ఉమెన్స్ వింగ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, యువ నారీ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ ఫౌండర్ డాక్టర్ షమా సుల్తాన అన్నారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ఫారుఖ్ షుబ్లి ఆదేశాల మేరకు సమితి ఉమెన్స్ వింగ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ షమా సుల్తాన గురువారం పెదకాకాని మండలం నంబూరు యానాది కాలనీల్లో వరద బాధితులు 250 మందికి దుప్పట్లు, రగ్గులు అందజేశారు. హోప్ విన్ హాస్పిటల్స్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వర్షాల వలన దెబ్బతిన్న రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన ప్యాచ్ వర్క్‌ లు రెండు రోజుల్లో పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగర కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా రోడ్ల ప్యాచ్ వర్క్స్‌పై వివరాలు అడిగి తగు ఆదేశాలు జారీ చేశారు.

అమ్మవారికి విశేష అలంకరణ



నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట అష్టలక్ష్మి మందిరంలో కోటి కుంకుమార్చనలో భాగంగా గురువారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సువాసినులకు అమ్మవారి గాజులు, కుంకుమ, గంధం అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మర్రిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

సబ్ డివిజన్ సర్వే రిపోర్టు జారీకి చర్యలు

- గత జనవరి నుంచి సర్వే సర్టిఫికెట్ల జారీ నిలిపివేసిన నగరపాలక సంస్థ
- స్థల రిజిస్ట్రేషన్లు, బ్యాంకు లోన్లకు సర్వే రిపోర్టే కీలకం
- సర్వే రిపోర్టు జారీ విషయంలో ప్రజల ఇబ్బందులపై కౌన్సిల్‌లో చర్చ
- గత నెల 21న జేసీ, పట్టణ ప్రణాళిక, సర్వే డిపార్ట్‌మెంట్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు
- 10 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



సిటిజన్ చార్టర్ వద్ద సర్వే రిపోర్టు కోసం దరఖాస్తు చేసుకుంటున్న నగర వాసులు

నెహ్రూనగర్: ఎట్టకేలకు సబ్ డివిజన్ సర్వే రిపోర్టు జారీకి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. గుంటూరు నగరపాలక సంస్థ ద్వారా జారీ చేసే సబ్ డివిజన్ సర్వే రిపోర్టు గత జనవరి నుంచి టౌన్ ప్లానింగ్ అధికారులు వివిధ కారణాలు చూపి ఆపివేశారు. ఈవిషయంపై గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో చర్చకు రావడంతో నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు చొరవ తీసుకుని సర్వే రిపోర్టు గతంలో నగరపాలక సంస్థ ద్వారానే ఇచ్చేవారని, కానీ పట్టణ ప్రణాళిక అధికారులు ఎక్కడలేని రూల్స్ తీసుకువచ్చి సర్వే రిపోర్టులు ఇవ్వకుండా ఆపేశారని.. తహసీల్దార్ కార్యాలయం ద్వారా సర్వే రిపోర్టు తీసుకోవాలని సూచించారని దీని వలన నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ పులి శ్రీనివాసులుకు సూచించారు. దీని విషయమై నగర కమిషనర్ గత నెల 21వ తేదిన జిల్లా జేసీ భార్గవ్ తేజ్, జిల్లా రిజిస్టర్ శైలజ, ఏడీ సర్వే నాగేశ్వర్‌లతో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్వే రిపోర్టుకు తగిన మార్గదర్శకాలను రూపొందించేందుకు కలెక్టర్‌కు తగు మినిట్స్‌తో నివేదించారు. కలెక్టర్ ఆమోదంతో సబ్ డివిజన్ సర్వే రిపోర్టు జారీకి సుమగం అయింది.

10 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సబ్ డివిజన్ సర్వే రిపోర్టు జారీకి అధికారుల నుంచి సానుకూల స్పందన రావడంతో 10వ తేదీ నుంచి సిటిజన్ చార్టర్ ద్వారా ప్రజల నుంచి సిబ్బంది దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీంతో గత 9 నెలల నుంచి టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే రిపోర్టు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిన నగరవాసులకు ప్రస్తుతం సర్వే రిపోర్టు జారీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలియడంతో తీపి కబురు విన్నట్లయింది.

పెండింగ్‌లో 8వేలకుపైగా దరఖాస్తులు

గత జనవరి నుంచి నగరపాలక సంస్థ సర్వే రిపోర్టు సర్టిఫికేట్ జారీ నిలుపుదల చేసింది. 'డి' నంబరు ఉన్నవాటికి తహసీల్దార్ కార్యాలయం నుంచి సర్వే రిపోర్టు తీసుకోవాలని, కేవలం టౌన్ సర్వేనంబర్ ఉంటేనే నగరపాలక సంస్థ సర్వే చేస్తుందని టౌన్ ప్లానింగ్ అధికారులు స్పష్టమైన ప్రకటన చేశారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు అన్ని డాక్యుమెంట్లు డి నంబర్‌తో ఉంటాయి. టౌన్ సర్వే నంబర్ ఉన్న డాక్యుమెంట్లు తక్కువగా ఉండటంతో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గత జనవరి నుంచి సుమారు 8వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం వీటిని ఏ విధంగా సర్వే చేపట్టాలో అర్థం కాగా టౌన్ సర్వే సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. గుంటూరు నగర జనాభాకు అనుగుణంగా గుంటూరు నగపాలక సంస్థకు సుమారు నలుగురు టౌన్ సర్వేయర్లు కావాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్క సర్వేయర్ మాత్రమే గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు కలిపి ఉన్నారు. వీటిన్నంటిని సిబ్బంది ఏ విధంగా సర్వే చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

'బాక్స్ ఆఫ్ కైండ్‌నెస్' ప్రారంభం



బాక్స్ ఆఫ్ కైండ్‌నెస్‌ను ప్రారంభిస్తున్న జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి, అధికారులు

లక్ష్మీపురం: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ లోని పలు కస్టమ్స్, జీఎస్టీ శాఖ కార్యాలయాలలో 'బాక్స్ ఆఫ్ కైండ్‌నెస్' కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. గుంటూరు కన్నవారితోటలోని కేంద్ర జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో నరసింహారెడ్డి బాక్స్ ఆఫ్ కైండ్ నెస్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 19వ తేదీ బాక్స్ ఆఫ్ కైండ్‌నెస్ కొనసాగుతుందన్నారు. ఎనిమిది రోజుల పాటు ఉద్యోగుల నుంచి సేకరించిన వస్తు సామగ్రిని కిట్ ల రూపంలో వరద బాధితులకు పంపిణీ చేస్తామన్నారు. విజయవాడ వరద ప్రాంతాలలో రెండు రోజులపాటు నిర్వహించిన రెస్క్యూ,రిలీఫ్ ఆపరేషన్ లో చురుగ్గా పాల్గొన్న ఉద్యోగులకు, వలంటీర్లకు ఈ సందర్భంగా కమిషనర్ ప్రశంసాపత్రాలు ఇచ్చి సత్కరించారు. అదనపు కమిషనర్ ఎస్.మధుసూదన రెడ్డి, జాయింట్ కమిషనర్ బి.లక్ష్మినారాయణ అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, రవికుమార్ సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు

మహిళల్లో పెరుగుతున్న మానసిక సమస్యలు



డాక్టర్ ఉమాజ్యోతికి స్టూళ్లు అందజేస్తున్న విజయలక్ష్మి, సిద్ధార్థ

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల మహిళల్లో మానసిక సమస్యలు నేడు బాగా పెరగడం చాలా ఆందోళనకరమైన విషయమని సఖి కేంద్రం లీగల్ అడ్వైజర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల విభాగంలో వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే సందర్భంగా రోగులకు అవసరమైన స్టూళ్లను విజయలక్ష్మి సహకారంతో సెవెన్ గ్రీన్ ఫౌండేషన్ నిర్వాహకులు సిద్ధార్థ అందజేశారు. ఈసందర్భంగా విజయక్ష్మి మాట్లాడుతూ మానసిక వ్యాధుల విభాగంలో వైద్య సేవలు బాగున్నాయని కితాబిచ్చారు. విభాగంలో రోగులకు మెరుగైన సేవలందించేందుకు తమవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తామని సిద్దార్ధ పేర్కొన్నారు. జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి మాట్లాడుతూ మానసిక వ్యాధుల విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలతో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అన్ని రకాల మానసిక సమస్యలకు చికిత్సలు అందించి మందులు సైతం అందిస్తున్నామని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నిమిషా, డాక్టర్ రత్నకిషి, డాక్టర్ సాయికృష్ణ, సీనియర్ సైక్రియాటిస్ట్ డాక్టర్ ప్రసాద్, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ రమ్య, పలువురు పీజీ వైద్యులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు

- నగరంలో ఇష్టానుసారంగా సర్వీస్ ఛార్జీలు వసూలు చేస్తున్న ఆటోవాలాలు
- కనీసం పట్టించుకోని ఆర్టీఏ, పోలీసు అధికారులు
- అటకెక్కిన ప్రీపెయిడ్ ఆటోస్టాండ్‌లు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోలు



బస్టాండ్‌లో అలంకారప్రాయంగా ప్రీపెయిడ్ ఆటో స్టాండ్

పట్నంబజారు: గుంటూరు నగరంలో ఫర్లాంగు దూరానికి ఆటో ఎక్కి దిగితే పూర్తి చార్జిని ఆటోవాలాలు నిర్దాక్షిణ్యంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు గుంటూరు పాత బస్టాండ్ సెంటర్ నుంచి సంజీవయ్యనగర్ రైల్వేగేటు వరకు ఒక్కో వ్యక్తికి సర్వీసు ఆటోడ్రైవర్లు రూ.20 వసూలు చేస్తున్నారు. పాత బస్టాండ్ దగ్గర ఆటో ఎక్కిన ప్రయాణికుడు అతి కొద్దిదూరంలోని విజయా టాకీస్, పశువుల ఆస్పత్రి దగ్గర దిగినా అతని దగ్గర రూ.20 వసూలు చేస్తున్నారు. అదేమంటే ఇవ్వాల్సిందేనంటూ దబాయిస్తున్నారు. గుంటూరు నగరంలో కొందరు ఆటోవాలాల దోపిడీ అధికమవుతోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ నుంచి మార్కెట్ మీదుగా శంకరవిలాస్ సెంటర్ వైపు, నగరంపాలెం వైపు ఇలా ఒక్కటని కాకుండా అన్నిరూట్లలో ఆటోవాలాలు ఇలానే వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆటో ఎక్కి దిగితే రూ.20 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది.

ఎక్కి దిగితే రూ.20, 30..

గుంటూరు జిల్లా పరిధిలో సుమారు 40వేల ఆటోలకుపైగా ఉండగా, గుంటూరు నగరంలోని 15వేల వరకు ఉన్నాయని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అయితే దూరప్రాంతాలకు బాడుగ ఆటోలు కాకుండా, గుంటూరు నగరంలో సర్వీస్ ఆటోలు 80శాతంకు పైగా తిరుగుతున్నాయి. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్, లాడ్జిసెంటర్, శంకర్‌విలాస్ సెంటర్, గుజ్జనగుండ్ల, కాకానిరోడ్డు, పొన్నూరు రోడ్డు, నందివెలుగు రోడ్డు ప్రాంతాలతో పాటు అనేక ముఖ్యమైన రహదారుల్లో తిరుగుతున్నాయి. అయితే ఆటోవాలాలు వ్యవహరిస్తున్న తీరు మాత్రంగా ప్రయాణికులకు తలనొప్పిగా మారింది. ఆటో ఎక్కడ ఎక్కినా.. కొద్దిపాటి దూరంలోనే దిగినా.. గమ్యస్థానాన్ని బట్టి కాకుండా ఎక్కి, దిగితే రూ.20పైగానే వసూలు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఘర్షణకు ఏ మాత్రం వెనుకాడటంలేదు.

అధికారులు నిర్ణయించిన ధరలు ఇలా..

దూరం	పగలు	రాత్రి
కి.మీ.లోపు (వ్యక్తికి)	రూ.15	రూ.20
" (బాడుగ)	రూ.40	రూ.60
1–5 కి.మీ (వ్యక్తికి)	రూ.20	రూ.30
" (బాడుగ)	రూ.60	రూ.90
5–10 కి.మీ (వ్యక్తికి)	రూ.25	రూ.40
" (బాడుగ)	రూ.75	రూ.110
10–15 కి.మీ (వ్యక్తికి)	రూ.30	రూ.45
" (బాడుగ)	రూ.90	రూ.135
15–20 కి.మీ (వ్యక్తికి)	రూ.35	రూ.50
" (బాడుగ)	రూ.100	రూ.150

గతంలో దీనిపై ఆర్టీఏ, పోలీసు అధికారులు అనేక సమావేశాలు పెట్టినప్పటికీ నీటిపై రాతలు మాదిరిగానే మారాయి.

ధరలు ఫిక్స్ చేసినా.. పట్టించుకునేవారేరీ?

నగరంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా గతంలో ట్రాఫిక్ పోలీసులు చార్జిల పట్టికను సూచిస్తూ.. ఈ విధంగా తీసుకోవాలని స్పష్టంగా సూచించారు. అయితే ఈ అంశాన్ని ఆటో యూనియన్ నేతలు, ఆటో యజమానులు, డ్రైవర్లు ఏ మాత్రం పట్టించుకోవటంలేదు. (అధికారులు సూచించినన కనీస నిబంధనలను ఆటోవాలాలు బేఖాతరు చేస్తున్నారు)

ప్రీ పెయిడ్‌ను పునరుద్ధరించండి మహాప్రభో...

గతంలో గుంటూరు ఎస్పీగా పనిచేసిన రాజేష్‌కుమార్ ఆటోచార్జీల నియంత్రణ, ప్రయాణికుల రక్షణ కోసం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో ప్రీపెయిడ్ ఆటోస్టాండ్‌లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్‌లో మాత్రం ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ అటకెక్కింది. పోలీసుల నేతృత్వంలో ఆటోస్టాండ్‌లు కొనసాగేవి. బస్టాండ్‌లోని ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ కింద అప్పట్లో సుమారుగా 250పైగానే ఆటోలు ఉండేవి. అవి పోలీసులు కేటాయించిన రేట్ల పట్టిక ద్వారా నడిచేవి. ఆ తరువాత వచ్చిన అధికారుల నిర్లక్ష్యంతో బస్టాండ్‌లోని ప్రీపెయిడ్ స్టాండ్ అలంకార ప్రాయంగా మారింది. రాత్రిళ్లు ఎంతో మంది ప్రయాణీకులు గుంటూరు బస్టాండ్ మీదుగా ప్రయాణీకులు చేసే పరిస్థితులు ఉన్నాయి. వారి భద్రత, ధరల నియంత్రణకు సంబంధించి ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ ఉంటే మరింత ఉపయోగాలు ఉండే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రయాణ ధరలు కూడా పోలీసులే ఫిక్స్ చేసి పంపటంతో పాటు, డ్రైవర్ ఫోన్ నెంబర్, వాహన నెంబర్, వెళ్లిన తరువాత ప్రయాణికులను క్షేమంగా దించారా లేదా అని తెలుసుకునే సౌలభ్యం ఉండటంతో ప్రయాణికులకు ఎంతో రక్షణ ఉండేది. ఆర్టీసీ బస్టాండ్‌లో మూలనపడ్డ ప్రీపెయిడ్ స్టాండ్‌ను తిరిగి పునరుద్ధరిస్తే ప్రయాణికులకు మరింత మేలు జరుగుతుంది.

కఠిన చర్యలు తీసుకుంటాం..



ప్రయాణికుల నుంచి ఆటోవాలాలు ఛార్జీలు అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అధికారులు గతంలో నిర్ణయించిన మాదిరిగానే ప్రయాణికుల నుంచి తీసుకోవాలి. ఇప్పటికే ఆటో యూనియన్‌లతో మాట్లాడి పలు సూచనలు చేశాం. మరోమారు ఆటోవాలాలతో సమావేశం ఏర్పాటు చేసి, ధరల నియంత్రణపై దృష్టి సారిస్తాం. అధిక ధరలపై ప్రయాణికుల నుంచి ఫిర్యాదు అందితే ఆటోలను సీజ్ చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తాం.

– షేక్ కరీం, డీటీసీ, గుంటూరు, జిల్లా

యువత సైన్యంలో చేరాలి



ఏసీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లతో మేజర్ అమర్‌దీప్, ప్రిన్సిపాల్ మోజెస్

గుంటూరు ఎడ్యుకేషన్: యువతరం సైన్యంలో చేరి దేశ రక్షణ విధుల్లో భాగస్వాములు కావాలని ఆర్మీ రిక్రూట్‌మెంట్ వైద్యాధికారి డాక్టర్ మేజర్ అమర్‌దీప్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ఏసీ కళాశాలలో గురువారం భారత సైన్యంలో చేరేందుకు అగ్నివీర్‌తో పాటు ఆర్మీలో ఉద్యోగావకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అమర్‌దీప్ మాట్లాడుతూ ఆర్మీలో చేరిన వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను గురించి వివరించారు. గుంటూరు నగరంలో ఘన చరిత్ర కలిగిన ఏసీ కళాశాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆర్మీలో చేరాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థులు ఎంతో మంది ఆర్మీలో వివిధ హోదాల్లో పని చేస్తున్నారని, భవిష్యత్తులో విద్యార్థులను ఇంకా పెద్ద సంఖ్యలో ఆర్మీకి పంపేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ 25 ఆంధ్ర బెటాలియన్ అధికారి లెఫ్టినెంట్ ఎల్‌కే సాగర్, ఆర్మ్‌డ్ బెటాలియన్ ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ కె.రవి, మాజీ సైనిక అధికారి సుబేదార్ అబ్దుల్ బేగ్, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజికసేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని హిందూ మేనేజిమెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని కళాశాలలో స్కూల్ ఆఫ్ హాస్పిటల్ మేనేజిమెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నగరంలోని ప్రముఖ ఆస్పత్రులకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు దంత, నేత్ర, ఊపిరితిత్తుల సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ముందు జాగ్రత్తల ప్రాముఖ్యతను వివరించారు. సామాజిక సేవలో విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా తమలోని నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవడంతో పాటు వ్యక్తిత్వాన్ని మెరుగుపరచుకోవచ్చన్నారు. అనంతరం డాక్టర్ తేజ, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సాయిబాబు పాల్గొని రక్తపోటు, మధుమేహం, ఊపిరితిత్తులు, దంత, నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. మెగా వైద్యశిబిరంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు జరిపారు. ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, ఎ.బాజీబాబు, ఎస్.మణికంఠ, బి.అనిత, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజిమెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల క్రయవిక్రయాలు నిషిద్ధం

లక్ష్మీపురం: నిషేధిత జాబితాలోని భూములు ఏ విధంగా అయితే క్రయ, విక్రయాలు జరిగాయో అదేవిధంగా వక్ఫ్ భూములకు కూడా వర్తిస్తుందని ముస్లిం యునైటెడ్ ముస్లిం జేఏసీ గుంటూరు అధ్యక్షుడు మహమ్మద్ కలీం గురువారం తెలిపారు. తాతలు, ముత్తాతలు కాలంలో ఆక్రమించుకున్న వక్ఫ్ భూములను తమ భూములుగా నేటితరం వాళ్లు భావించవచ్చు అని తెలిపారు. అదేవిధంగా తాత, ముత్తాతల కాలంలో ఆక్రమించుకునేది అన్న విషయం వారికి తెలియక, నిజంగా ఆ ఆస్తి వారిదైతే వక్ఫ్ సంస్థకు వ్యతిరేకంగా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించే అవకాశం వక్ఫ్ చట్టం కల్పించిందని తెలియజేశారు. ట్రిబ్యునల్ తర్వాత మిగతా కేసుల మాదిరి గానే హైకోర్టు తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని తెలిపారు. నిషేధిత భూముల జాబితా 22(ఎ)(1)ఏ లో దేవదాయ, ధర్మాదాయ శాఖ భూములు,22(ఎ)(1)బి లో రెవెన్యూ, అసైన్డ్ భూములు పాటు 22ఎ(1)సి లో వక్ఫ్ భూములు ఉంటాయని తెలిపారు. వక్ఫ్ సంస్థకు చెందిన భూములను ఎవరూ క్రయ,విక్రయాలు జరపటానికి అధికారం ఉండదని తెలిపారు. కేవలం ఆదాయ మార్గంగా వ్యవసాయ భూములయితే 11 నెలల అద్దె చొప్పున కౌలుకిచ్చే అధికారం ఉందని తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

లక్ష్మీపురం: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జిల్లాలో లక్ష ఎకరాలలో పంట నష్టం వాటిల్లిందని వెంటనే రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. గురువారం కేంద్ర బృందాన్ని పెదకాకాని మండలంలోని గుంటూరు ఛానల్ వద్ద కలిసి వినతిపత్రాన్ని సీపీఎం బృందం అందజేసింది. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ జిల్లాలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.10వేలు నష్ట పరిహారం ఇస్తామని ప్రకటించడం సరికాదన్నారు. కేంద్ర బృందం పంట నష్టాన్ని అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించి రాష్ట్రానికి రూ.10వేల కోట్లు వరద సహాయాన్ని ఇప్పించాలని కోరారు. బృందాన్ని కలిసిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, జిల్లా నాయకులు జొన్నా శివశంకర్, ఎస్.శివాజి, బెర్రగాని శ్రీనివాసరావు, కె.అజయ్‌కుమార్, కె.సత్యనారాయణ, వెంకటరెడ్డి, అప్పిరెడ్డి తదితరులు ఉన్నారు.

వరద బాధితులను ఆదుకోండి

లక్ష్మీపురం: విజయవాడ నగరంలో గత 60 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా అపార నష్టం వాటిల్లిందని, విజయవాడ వాసులను అందరూ ఆదుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు వేలుగూరి రాధా కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శంకర్ విలాస్ సెంటర్‌లోని సీపీఐ గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం కొనసాగిస్తున్న నిధి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నగర సమితి సభ్యులు పాల్గొన్నారు.

పాటలేని ప్రపంచాన్ని ఊహించలేం

లక్ష్మీపురం: మనిషిని కదిలించి కరిగించే మహత్తర శక్తి సంగీతానికి ఉందని సాంస్కృతిక కార్యక్రమాల కో–ఆర్డినేటర్ బిళ్లా అశోక్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం పాడుదం రండి బృందం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాటలేని ప్రపంచాన్ని ఊహించలేమన్నారు.సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, గాయకుడు రత్నాజీ మాట్లాడారు. అదేవిధంగా పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో భారత బృందం కొత్త చరిత్రను లిఖించడంపై సంస్థ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అనారోగ్య కారణాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాసవి నగర్ సమీపంలో నివాసం ఉండే తియ్యగూర మునిరెడ్డి (60) లారీ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మునిరెడ్డి పురుగు మందు సేవించి బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని బంధువుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.